సాక్షి
జోగుళాంబ గద్వాల
బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



జములమ్మ ఉత్సవాలు

నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



గంగాపురం.. జనసంద్రం

గంగాపురం చెన్నకేశవస్వామి రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

వివరాలు 8లో ▸



వాతావరణం

ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

'చేనేత అభయహస్తానికి' దరఖాస్తు చేసుకోండి

గద్వాల: తెలంగాణ చేనేత అభయహస్తం పథకంలో భాగంగా నేతన్న పొదుపు నిధి పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికులకు పొదుపు, సాంఘిక భద్రత కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేనేత కార్మికుల సహకార రంగం, సహకారేతర రంగంలో ఉన్నటువంటి వారితో పాటు అనుబంధ కార్మికులందరికీ పథకం వర్తిస్తుందని తెలిపారు. 18 ఏళ్లు పైబడిన వారు కనీసం 50 శాతం చేనేత వృత్తి నుంచి ఆదాయం పొందాలన్నారు. ప్రతినెలా 15వ తేదీలోగా తమ వేతనం నుంచి 8 శాతం ఆర్‌డీ–1లో జమ చేసుకోవాలని తెలిపారు. తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చే 16 శాతం వేతనాలను సంబంధిత ఆర్‌డీ–2లో 24 నెలలలోపు తీసుకునేందుకు అనుమతించబడదన్నారు. అర్హత కలిగిన చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టెండర్ల ఆహ్వానం

గద్వాల: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12 బీసీ ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు అవసరమైన 18 రకాల వంట పాత్రలు, ఇతర సామగ్రి సరఫరా నిమిత్తం ట్రేడ్ లైసెన్స్ కలిగిన వ్యాపారుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు టెండర్ ప్రాసెసింగ్ ఫీజు కింద రూ. 5 వేలు, ఈఎండీ రూ. 10 వేలను జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి, జోగుళాంబ గద్వాల వారి పేరుపై డీడీ చెల్లించాలని సూచించారు. టెండర్ షెడ్యూల్ ఫారాలు ఈ నెల 5వ తేదీ నుంచి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. 12న మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లను తెరవనున్నట్లు పేర్కొన్నారు. గడువు తీరిన తర్వాత వచ్చే టెండర్లను స్వీకరించరని తెలిపారు.

రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలి



కేటీదొడ్డి: ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియా నాయక్ అన్నారు. మంగళవారం కేటీదొడ్డి మండలం పాగుంట, కొండాపురం, కుచినెర్ల, చింతలకుంట, నందిన్నె గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లులను పరిశీలించారు. దుకాణాల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. డీఏఓ వెంట ఏఓ సాజీద్ రెహమాన్, ఏఈఓలు ఉన్నారు.

పోలీసు క్రీడాకారులకు అభినందన



గద్వాల క్రైం: కరీంనగర్ జిల్లాలో ఇటీవల జరిగిన తెలంగాణ పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్–2025లో ప్రతిభకనబరిచి.. పతకాలు సాధించిన జిల్లా పోలీసు క్రీడాకారులను మంగళవారం ఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. తైక్వాండో 87 కేజీల విభాగంలో రామాంజనేయులు, 68 కేజీల విభాగంలో రవికుమార్ గోల్డ్ మెడల్స్ సాధించారు. స్విమ్మింగ్‌లో వీర ప్రతాప్‌రెడ్డి కాంస్య పతకం పొందారు. మెడల్స్ సాధించిన సిబ్బందిని ఎస్పీతో పాటు పలువురు అభినందించారు.

నేటి నుంచి కందుల కొనుగోలు

అయిజ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డులో బుధవారం నుంచి కందులను కొనుగోలు చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. కందులకు ప్రభుత్వం రూ. 7,550 మద్దతు ధర ప్రకటించిందని.. కొనుగోలు కేంద్రంలో కందులు అమ్మే రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి ధ్రువపత్రంతో పాటు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. కందుల్లో 12 శాతం తేమ మించకుండా ఉండాలన్నారు. తాలు గింజలు, చెత్తా చెదారం లేకుండా శుభ్రపరిచి ఉండాలని తెలిపారు. ఒక్కో ఎకరానికి 3.30 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారని తెలిపారు.

పంట పండేనా?

తుంగభద్ర నదిలో తగ్గిన నీటి ప్రవాహం



- ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 4 ఇంచులకు పడిపోయిన ఓవర్ ఫ్లో
- మరో మూడు రోజులు మాత్రమే తుమ్మిళ్ల లిఫ్ట్‌కు నీరందే అవకాశం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

శాంతినగర్: ఆర్డీఎస్ కెనాల్ కింద యాసంగి పంటలు సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్డీఎస్, తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతంలో సుమారు 37వేల ఎకరాల్లో మిరప, వేరుశనగ, సీడు జొన్న, మొక్కజొన్న, కూరగాయలను పండిస్తున్నారు. అయితే ఆర్డీఎస్ కెనాల్‌లో నీటిపారుదల నిలిచిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పది రోజుల క్రితం వారంపాటు రాష్ట్ర వాటాగా విడుదల చేసిన ఒక టీఎంసీ నీరు ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్దకు మాత్రమే చేరుకుని నిలిచిపోయాయి. అక్కడి నుంచి ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని వదలగా.. డిస్ట్రిబ్యూటరీ 22 వరకు వచ్చి ఆగిపోయాయి. దిగువన ఉన్న డీ–22 నుంచి డీ–40 వరకు సాగునీరు అందకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసీ కెనాల్ వాటాగా విడుదల చేసిన రెండు టీఎంసీల నీటితో తుమ్మిళ్ల లిఫ్ట్ వద్దకు నీరు చేరింది. ప్రస్తుతం వారం రోజులుగా సాగునీరు అందుతోంది. హెడ్‌వర్క్స్ వద్ద నాలుగు ఇంచుల మేర ఓవర్ ఫ్లో (2357 క్యూసెక్కులు) ఉంది. మరో మూడు రోజులపాటు తుమ్మిళ్ల లిఫ్ట్‌కు సాగునీరందే అవకాశం ఉందని.. ఆ తర్వాత పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

నీరందకపోతే 'తుమ్మిళ్ల' బంద్

తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం రోజురోజుకూ తగ్గుతోంది. దీంతో తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద ఏర్పాటుచేసిన సంపునకు నీరందే వరకు మాత్రమే లిఫ్ట్ మోటారు పనిచేస్తుంది. నీరందకపోతే మోటార్‌ను నిలిపివేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీ బ్యాక్‌వాటర్ ఉండటంతో మోటార్‌ను రన్నింగ్‌లో ఉంచారు.

ఇండెంట్ పూర్తవ్వడంతో..

టీబీ డ్యాం నుంచి విడుదల చేసిన నీటితో రాజోళిబండ హెడ్‌వర్క్స్ (ఆనకట్ట) వద్ద మంగళవారం 4 ఇంచుల మేర ఓవర్‌ఫ్లో ఉన్నట్లు ఆర్డీఎస్ అధికారులు వెల్లడిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన ఇండెంట్‌లు పూర్తవ్వడంతో ఎగువ (టీబీ డ్యాం) నుంచి నీటి ప్రవాహం నిలిచిపోయిందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలతో మరో మూడు రోజులు మాత్రమే సాగునీరు అందుతుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

మార్చి వరకు నీరందించాలి..



ప్రస్తుతం మొక్కజొన్న, సీడు జొన్న పంటలు కంకి దశలో వున్నాయి. నెల రోజులపాటు నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. మార్చి 15 వరకు నీరందితేనే పంటలు పూర్తిస్థాయిలో పండే అవకాశం ఉంది. గత నెలలో 15 రోజులపాటు నీరందక పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు పరిస్థితి అలా జరిగితే ఒక్కో రైతు రూ.లక్షల్లో నష్టపోతారు. మార్చి 15 వరకు ఆర్డీఎస్ కెనాల్ ద్వారా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి. – గోవర్ధన్‌రెడ్డి, ఆయకట్టు రైతు, తనగల, వడ్డేపల్లి మండలం

రైతులకు న్యాయం చేయాలి..



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటాగా తుంగభద్ర డ్యాం నుంచి ఒకే సారి ఇండెంట్ పెట్టాలి. మన వాటాగా ప్రతీసారి ఒక టీఎంసీ పెట్టడం వల్ల నదిలో ఇంకిపోవడం.. ఎగువన ఉన్న కర్నాటక రైతులు వాడుకోవడంతో దిగువన ఉన్న తుమ్మిళ్ల లిఫ్ట్‌కు నీరు చేరే అవకాశం ఉండటం లేదు. కేసీ కెనాల్, ఆర్డీఎస్ అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసుకుని ఇద్దరు ఒకే సారి ఇండెంట్ పెట్టి రైతులకు న్యాయం చేయాలి. – మద్దిలేటి, ఆయకట్టు రైతు, రామాపురం, వడ్డేపల్లి మండలం

నాలుగో ఇండెంట్ పెడతాం..

తుంగభద్ర బోర్డులో నాలుగో ఇండెంట్ పెట్టే విషయమై చర్చించేందుకు బుధవారం సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఆర్డీఎస్ వాటాగా రెండు టీఎంసీలు టీబీ బోర్డులో పెట్టడానికి అవకాశం ఉంది. నాలుగో ఇండెంట్ ఎప్పుడు పెట్టే విషయంపై అధికారులతో చర్చిస్తాం. అంతేగాక కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడి ఒకే సారి ఇండెంట్ పెట్టేందుకు కృషిచేస్తాం. – శ్రీనివాసులు, ఆర్డీఎస్ ఈఈ

ఇసుక తీతతో సమస్య తీవ్రం..

తుంగభద్ర నదికి దక్షిణం వైపున ఏపీ ప్రభుత్వం ఇసుక రీచ్‌లు ఏర్పాటుచేసి యంత్రాల ద్వారా ఇసుక తోడుతున్నారు. దీంతో తుమ్మిళ్ల లిఫ్ట్‌కు రావాల్సిన నీరు అటు వైపుగా వెళ్తుండటంతో నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. నదిలో ఇసుక మేటలు తీయడంతో ఎగువ నుంచి వచ్చే నీరు ఏపీ వైపు పరుగులు తీస్తోందని.. భవిష్యత్‌లో తుమ్మిళ్ల లిఫ్ట్‌కు నీరందే అవకాశాలు ఉండవని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న, సీడు జొన్న పంటలు కంకి దశలో ఉన్నాయి. నీటి తడులు అందించకపోతే దిగుబడి తగ్గి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం ఇలా..

చారకొండలో ఇళ్లు కూల్చివేత



ఇళ్లు తొలగింపులో భాగంగా సామగ్రిని వాహనంలోకి వేస్తున్న పోలీసులు, బాధితులు

- బైపాస్ నిర్మాణం కోసం రంగంలోకి దిగిన హైవే అధికారులు
- పోలీసులను మోహరించి తతంగం పూర్తి
- అడ్డుకున్న బాధితులు.. కొద్దిసేపు ఉద్రిక్తత

చారకొండ: మండల కేంద్రంలో బైపాస్ నిర్మాణానికి అడ్డుగా ఉన్న ఇళ్ల కూల్చివేత ఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చారకొండ నుంచి మర్రిపల్లి వరకు జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారి–167 కోసం గతంలోనే భూ సేకరణ చేపట్టగా.. అలైన్‌మెంట్ మార్పులో చిన్నపాటి సమస్యలతో రహదారి నిర్మాణం ఆలస్యమైంది. హైవే అధికారులు బైపాస్ నిర్మాణం కోసం భూ సేకరణ చేసి పరిహారం చెల్లించి సర్వే పూర్తిచేశారు. ఈ క్రమంలో మరోసారి మండల కేంద్రంలో ఇళ్లు, ప్లాట్లు, భూమి కోల్పోతున్న గ్రామస్తులు నేరుగా ఉన్న ప్రధాన రోడ్డు గుండానే రహదారి నిర్మాణం చేపట్టాలని, బైపాస్ నిర్మాణం ఆపాలని ఆందోళన చేసినా హైవే అధికారులు పట్టించుకోలేదు. గ్రామస్తుల కోరిక మేరకే బైపాస్ నిర్మాణం చేపట్టామని, ఇందుకు సంబంధించి నష్టపోయిన వారందరికీ పరిహారం సైతం చెల్లించామని.. ఇప్పుడు ఆందోళన చేయడం సరికాదని వారు పేర్కొంటున్నారు. అయితే కొద్ది మంది ఒప్పుకోకపోవడంతో పరిహారం చెల్లించలేకపోయారు. తాజాగా మంగళవారం భారీ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారుల చొరవతో హైవే అధికారులు నాలుగు జేసీబీలతో వచ్చి 29 ఇళ్లను కూల్చివేశారు. దీంతో బాధితులు అడ్డుకొని ఆందోళన చేపట్టగా.. తగిన నష్టపరిహారం ఇప్పిస్తామని అధికారులు హామీ ఇచ్చి, బలవంతంగా ఇళ్లలో ఉన్న సామగ్రిని పునరావాసంగా ఏర్పాటు చేసిన కేంద్రాలకు తరలించారు. కళ్లముందే కట్టుకున్న ఇళ్లు నేలమట్టం కావడంతో కన్నీరు మున్నీరయ్యారు. దీంతో



చారకొండలో ఇళ్లను కూల్చివేస్తున్న జేసీబీ

పటిష్ట బందోబస్తు

ఇళ్ల కూల్చివేతలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కల్వకుర్తి డీఎస్పీ, వెల్దండ, కల్వకుర్తి సీఐలు, చారకొండ ఎస్‌ఐతోపాటు ఇతర మండలాల ఎస్‌ఐలు, సుమారు 150 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఇళ్లను కూల్చివేస్తున్న సమయంలో బాధితులు ఆందోళన చేయగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. గిరిజమ్మ అనే మహిళ తన ఇంటిని కూల్చివేయొద్దని భీష్మించి కూర్చోగా మహిళా పోలీసులు ఆమెను బలవంతంగా అరెస్టు చేసి వెల్దండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సర్వం కోల్పోయాం..

ఎంతో కష్టాలకు ఓర్చి ఇల్లు నిర్మించుకున్నాం. జాతీయ రహదారి నిర్మాణం పేరిట బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తుండటంతో ఇంటితో సహా సర్వం కోల్పోతున్నాం. ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో ఎక్కడా ఇల్లు కట్టుకోలేం. మా బతుకులు చిన్నాభిన్నం అయ్యాయి. బలవంతంగా నన్ను నా కుటుంబాన్ని అరెస్టు చేసి ఇల్లు కూల్చారు. – గిరిజమ్మ, బాధితురాలు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, రైతు సంబరాలను పురస్కరించుకొని మంగళవారం ఆరు పళ్ల విభాగం వృషభరాజుల బలప్రదర్శన (బండలాగుడు) పోటీలను నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వృషభరాజులు బండలాగుడు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. అదే విధంగా బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.5,700

గద్వాల వ్యవసాయం: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డుకు మంగళవారం 960 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. క్వింటాల్ గరిష్టంగా రూ.5,700, కనిష్టంగా రూ.3,500, సరాసరి రూ. 5,169 ధరలు వచ్చాయి. అదే విధంగా 93 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా.. గరిష్టంగా రూ.6,868, కనిష్టంగా రూ. 2,029, సరాసరి రూ. 6,709 ధరలు వచ్చాయి.

ముగ్గురికి ఏఎస్‌ఐలుగా పదోన్నతి

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్‌కు ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి తర్వాత ముగ్గురికి వేరే చోట్ల పోస్టింగ్ ఇచ్చారు. ఏఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిలో ఎస్.శ్రీనివాసులు(మహబూబ్‌నగర్), లచ్చునాయక్ (నాగర్‌కర్నూల్), ఏ.ప్రేమ్‌కుమార్ (గద్వాల) కు పదోన్నతి కల్పించారు.

కనులపండువగా అంజన్న రథోత్సవం



ఆంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభోత్సవం, పల్లకీసేవ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి స్వామివారి రథోత్సవం కమనీయంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆంజనేయస్వామి కలువుదీరగా.. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా హనుమాన్ నామస్మరణ మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉత్సవాల్లో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ కవిత, ధర్మకర్త గిరిరావు చర్యలు తీసుకున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



గట్టు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ తిరుపతిరావు

గట్టు: వ్యవసాయం, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ తిరుపతిరావు అన్నారు. మంగళవారం మండలంలోని మల్లాపురం నుంచి ఆలూరు వరకు సుమారు రూ. కోటి నిధులతో చేపట్టిన 33 కేవీ విద్యుత్ లైన్ పనులతో పాటు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు రూ. 50 కోట్లతో విద్యుత్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 11కేవీ ఫీడర్లపై 150 యాంప్స్ కంటే ఎక్కువ లోడు పడకుండా, 33 కేవీ ఫీడర్‌పై 300 యాంప్స్ కంటే ఎక్కువ లోడు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఓవర్ లోడ్‌ను తగ్గించేందుకు అవసరమైన పనులు చేపడుతున్నామన్నారు. ఓవర్ లోడ్ కారణంగా తరచూ తెగిపోయే వైర్లను కూడా మారుస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి.. వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యుత్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

■ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న కుసుమ్ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ తిరుపతిరావు కోరారు. ఈ పథకంతో రైతులు తమ వ్యవసాయ పొలాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంగల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఎస్ఈ వెంట ఏడీఈ గోవిందు, కన్‌స్ట్రక్షన్ ఏడీఈ సత్తార్ బాషా, ఏఈ చెన్నయ్య ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలు

గద్వాలటౌన్: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లావ్యాప్తంగా 43 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉండగా.. 34 కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం జరిగిన జనరల్ విభాగంలో 605 మంది విద్యార్థులకు గాను 581 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 505 మందికి గాను 454 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన జనరల్ విభాగం ప్రయోగ పరీక్షలకు 339 మందికి గాను 333 మంది హాజరు కాగా.. ఆరుగురు గైర్హాజరయ్యారు. వృత్తివిద్యా కోర్సులో 461 మంది విద్యార్థులకు గాను 443 మంది హాజరయ్యారు. గద్వాల, పుల్లూరులో కళాశాలల్లో ప్రయోగ పరీక్షలను డీఐఈఓ హృదయరాజు పర్యవేక్షించారు.



జిల్లా కేంద్రంలో ప్రయోగ పరీక్షలు చేస్తున్న విద్యార్థులు

పేదలను చదువుకు దూరం చేయొద్దు



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ నాయకులు స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోనే అయిజ మండలం పెద్దదని.. ఇక్కడ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక మధ్యలోనే చదువు మానేస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తంచేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాలకృష్ణ, భగత్ రెడ్డి, భీమసేన్‌రావు, నాగేశ్వర్ రెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, రఘు, శివ, శ్రీను, రాజశేఖర్, శివన్న, నరసింహారావు, మహేష్, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన బస్సులు

రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్/ కొల్లాపూర్: వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు అందజేస్తామని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్, కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రీజియన్‌లో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అద్దెకు తీసుకోవచ్చన్నారు. ప్రతి కిలోమీటర్‌పై గతంలో కంటే రూ.7 తగ్గింపు ఉందని, 6 గంటల వెయింటింగ్ చార్జీ మినహాయింపు ఉంటుందన్నారు. ప్రైవేట్ వాహనాల కన్నా తక్కువ ధరకు బస్సులు వస్తాయని, డ్రైవర్ బత్తా కట్టనవసరం లేదని, సౌకర్యవంతమైన బీఎస్–6 అధునాతన టెక్నాలజీ ఉన్న కొత్త బస్సులు, చెప్పిన చోట నుంచి ఎక్కడికైనా, ఎన్ని గంటలైనా అద్దెకు తీసుకోవచ్చని చెప్పారు. బస్సులను బుకింగ్ చేసుకోవడానికి డిపోల వారీగా అచ్చంపేట– 99592 26291, గద్వాల– 99592 26290, కల్వకుర్తి– 99592 26292, కొల్లాపూర్– 90004 05878, కోస్గి– 99592 26293, మహబూబ్‌నగర్– 99592 26286, నాగర్‌కర్నూల్– 99592 26288, నారాయణపేట– 99592 26293, షాద్‌నగర్– 99592 26287, వనపర్తి– 99592 26289 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 6వ తేదీన (గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు నాగరాజు, రాఘవేందర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ జరుగుతాయని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం 99590 16610 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

శుభకార్యానికి వెళ్లి వస్తూ అనంత లోకాలకు..

- కల్వర్ట్‌ను ఢీకొని కారు బోల్తా
- వివాహిత మృతి


పుష్పలత (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: శుభకార్యానికి వెళ్లి వస్తూ కల్వర్టును ఢీకొని కారు బోల్తా పడటంతో ఓ వివాహిత మృతిచెందిన ఘటన మండలంలోని చందుబట్ల గేటు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు.. పెంట్లవెల్లి గ్రామానికి చెందిన భాస్కర్ రైస్‌మిల్లు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు తన భార్య పుష్పలత(47) కూతురు భవానితో కలిసి హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున కారులో పెంట్లవెల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. చందుబట్ల గేటు వద్ద కారు కల్వర్టును ఢీకొని బోల్తాపడటంతో పుష్పలతకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. మృతురాలి కుమారుడు రాఘవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.4 లక్షలు చోరీ

నారాయణపేట: జిల్లాకేంద్రంలోని సెంటర్ చౌరస్తాలో మంగళవారం ఆపి ఉన్న ద్విచక్ర వాహనం నుంచి రూ.4 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. దామరగిద్ద మండలం కానుకుర్తికి చెందిన పూజారి నారాయణ జిల్లాకేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో రూ.4 లక్షల డ్రా చేసి బ్యాంకులో పెట్టుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో సెంటర్‌చౌక్‌లో ఉన్న గోల్డెన్ బేకరి వద్ద వాహనాన్ని నిలిపి లోనికి వెళ్లి తినుబండారాలు కొనుగోలు చేశారు. అదే సమయంలో వాహనంపై బ్యాగులో దాచిన రూ.4 లక్షలను మరో బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. తమ బంధువుల పెళ్లికోసం తీసుకొచ్చిన డబ్బులని బాధితుడు తెలిపారు.

లేగదూడపై చిరుత దాడి

కోస్గి రూరల్: లేగదూడపై చిరుత దాడి చేసి చంపేసిన సంఘటన గుండుమాల్ గ్రామంలో చోటుచేసుకుంది. అటవీ శాఖాధికారి లక్ష్మణ్‌నాయక్ తెలిపిన వివరాలు.. గుండుమాల్‌కి చెందిన గుడిసె కుర్మయ్య సోమవారం రాత్రి తమ వ్యవసాయ పొలం వద్ద పశువుల కట్టేసి ఇంటికొచ్చాడు. మంగళవారం ఉదయం పొలానికెళ్లి చూడగా లేగదూడపై చిరుత దాడిచేసి చంపేసింది. చుట్టుపక్కల వారి సహాయంతో ఫారెస్ట్ అధికారికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకొని పంచనామా నిర్వహించి లేగదూడపై చిరుత దాడి చేందని నివేదికను పైఅధికారులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హోంగార్డును అభినందించిన డీఐజీ



మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ జోన్ పరిధిలో ఉత్తమ విధులు నిర్వహించిన హోంగార్డు నర్సింహులను మంగళవారం జిల్లాకేంద్రంలో డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో హోంగాడ్డు సేవలు ఎంతో కీలకమన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించే హోంగార్డులను ప్రోత్సాహిస్తామన్నారు. ఇలాంటి ప్రత్యేక గుర్తింపు వల్ల వారిలో మరింత ఉత్సాహం అందిస్తుందన్నారు.

గంగాపురం.. జనసంద్రం

రథసప్తమి, రథోత్సవం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రథసప్తమి, రథోత్సవం సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గ్రామ కూడళ్లు, ఆలయ పరిసరాలు చెన్నకేశవ, గోవింద నామస్మరణతో మార్మోగాయి. చెన్నకేశవా.. వచ్చామయ్యా అంటూ భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడం కనిపించింది. పలువురు భక్తులు వ్రత మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, కొత్త కుండల్లో వంటలు చేసి దాసంగాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు సమర్పించి కోనేటిలో స్నానమాచరించి గండ దీపాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి మొక్కులు చెల్లించుకోగా.. పలువురు గోవులు సమర్పించారు. భక్తులు భారీగా తరలిరావడంతో స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది.

- ఉదయం మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆలయానికి చేరుకోగా పాలకమండలి సభ్యులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా రథోత్సవం..

మంగళవారం రాత్రి నిర్వహించిన రథోత్సవం శోభాయమానంగా సాగింది. రథాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామ విశ్వబ్రాహ్మణుల ఇళ్లకు మేళతాళాలతో వెళ్లి ఆలయానికి ఆహ్వానించారు. అనంతరం బలిహరణం, హోమం జరిపించిన పండితులు అందంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ఉంచారు. విశ్వ బ్రాహ్మణులు రథానికి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు గోవింద, చెన్నకేశవ నామస్మరణలతో ముందుకు లాగారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఆలయ ప్రాంగణంలో నైవేద్యాలు తయారుచేస్తున్న భక్తులు


కోనేరు వద్ద భక్తులు

జములమ్మ ఉత్సవాలు ప్రారంభం

- నేడు మెట్టినింటికి చేరుకోనున్న అమ్మవారు
- ఆహ్వానం పలికేందుకు పుట్టినింటికి బయల్దేరిన ఎద్దులబండి


అలంకరణలో జములమ్మ అమ్మవారు

గద్వాల న్యూటౌన్: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, డప్పుల మోతలు, వేలాదిగా తరలివచ్చిన భక్తుల సందడి ఆలయ పరిసరాల్లో కనిపించింది. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆహ్వానించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి ఎద్దులబండి పుట్టిన ఊరైన గుర్రంగడ్డకు బయలుదేరింది. అంతకుముందు అర్చకులు ఆలయంలో, అమ్మవారి నాగపడిగకు సంప్రదాయ పూజలు జరిపించారు. అనంతరం నాగపడిగను పూజారులు తలపై ధరించి ఎద్దులబండిపై బయలుదేరారు. డప్పుల మోతలు, మేళతాళాలు, భక్తుల పూనకాల నడుమ ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అమ్మవారు బుధవారం ఉదయం 6 గంటలకు జమ్మిచేడులోని జములమ్మ ఆలయానికి చేరుకోనున్నారు.


నాగపడిగతో బయలుదేరిన అర్చకులు

రేవతిని అభినందించిన డీఎఫ్‌ఓ


ఢిల్లీలో రాష్ట్రపతికి అభివాదం చేస్తున్న చెంచులు (ఫైల్)

మన్ననూర్: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో మన్ననూర్ ఐటీడీఏ నుంచి చెంచు మహిళ కాట్రాజు రేవతి (కొండనాగుల) పాల్గొన్నారు. మంగళవారం తిరిగి గ్రామానికి చేరుకోగా ఐటీడీఏ ఇంఛార్జీ పీఓ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి ఐటీడీఏ కార్యాలయానికి పిలిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర వేడుకలకు అన్ని రాష్ట్రాల నుంచి సమాజం గురించి కొంత పరిజ్ఞానంతో పాటు సమాజసేవ చేస్తున్న చెంచులను పిలువడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ క్రమంలో మన్ననూర్ ఐటీడీఏ నుంచి కాట్రాజు రేవతి (కొండనాగుల), అదిలాబాద్ ఐటీడీఏ నుంచి కొలాం జాతికి చెందిన కేశవరావుకు అవకాశం దక్కిందని తెలిపారు. గత నెల 22న బయలుదేరిన వీరు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడే రాష్ట్రపతి భవన్‌లో విడిది ఏర్పాటు చేయడంతో పాటు పర్యాటక ప్రదేశాలను చూసే అవకాశం కల్పించారని, 12 రోజుల ప్రయాణం అనంతరం మంగళవారం స్వగ్రామాలకు చేరుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఓ జాఫర్ హుస్సేన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తొలి ప్రయత్నంగా 'సుద్దాల' ఉత్సవాలు

- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు
- ప్రారంభించనున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోనే తొలి ప్రయత్నంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలకు వేదికగా నిలుస్తున్నట్లు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుశ్రుత ప్రజా వైద్యశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైవిధ్య భరితమైన కార్యక్రమాలు లేనందున విద్యార్థుల్లో సృజనాత్మకత కొరవడిందన్నారు. ఈలోటును భర్తీ చేయడానికి ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు. ఈమేరకు సాంస్కృతిక కమిటీ ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల వేదిక కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అత్యున్నత విలువలను, కళల్ని యువతకు పరిచయం చేసేందుకే నేటినుంచి రెండు రోజులపాటు పది అంశాలపై సాంస్కృతిక కళా ప్రదర్శనలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని, విజేతలకు ప్రముఖ సినీరచయిత సుద్దాల అశోక్‌తేజ బహుమతులు అందజేస్తారన్నారు. ఉత్సవాల వేదిక కమిటీ అధ్యక్షులు బెక్కం జనార్దన్ మాట్లాడుతూ పట్టణంలోని కళాశాల విద్యార్థులు, యువత, ప్రజలు ఈ సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉత్సవాల వేదిక కమిటీ ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, ఉపాధ్యక్షులు ఎం.కురుమయ్య పాల్గొన్నారు.

మద్యం, ధూమపానంతో పేగులకు హాని

- జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్
- ఐదుగురికి లాపరోటమీ సర్జరీలు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డాక్టర్ సునీల్

పాలమూరు: అధిక మోతాదులో మద్యం, సిగరేట్లు తాగడంతో పాటు దీర్ఘకాలికంగా అల్సర్ సమస్యలు ఉండటంతో పేగులకు హాని జరిగే అవకాశముందని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ అన్నారు. ఆస్పత్రిలోని జనరల్ సర్జరీ విభాగం వైద్యబృందం ఐదుగురు రోగులకు అత్యవసర లాపరోటమీ సర్జరీ చేసిన నేపథ్యంలో ఆ వివరాలను ఆస్పత్రి సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌కు చెందిన చంద్ర, హన్వాడ మండలం కొత్తపేట్‌కు చెందిన మునిస్వామి, గండేడ్ మండలం గాదిరాలకు చెందిన తిప్పలయ్య, తిమ్మాజీపేట మండలం గొరిటాకు చెందిన ఆంజనేయులు, కొత్తకోట మండలం కానాయపల్లికి చెందిన మణెమ్మ అనే రోగులు పేగులకు రంధ్రం ఏర్పడి తీవ్ర కడుపునొప్పి, వాంతులు, ఇతర సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. వేర్వేరు తేదీల్లో వీరు ఆస్పత్రిలో చేరగా వారిని పరీక్షించి ఆరోగ్యశ్రీ కింద లాపరోటమీ సర్జరీలు చేశారన్నారు. ఇదే సర్జరీలు బయట ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేస్తే ఒక్కొక్కరికి రూ.2లక్షలు ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సునీల్, వైద్యులు వంశీ, జగన్‌మోహన్, రహీముద్దీన్, గాయత్రి, దీపుకుమార్, గోపాల్‌నాయక్, సాయిచరణ్, చక్రధర్, విజేత, సౌమ్య పాల్గొన్నారు.

పూడ్చిన శవం వెలికితీసి పోస్టుమార్టం


ఇందువాసి శ్మశానవాటికలో ఫోరెన్సిక్ అధికారులు, పోలీసులు

గట్టు : మండలంలోని ఇందువాసికి గ్రామంలో మంగళవారం పూడ్చిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. వివరాలు.. ఇందువాసికి చెందిన కుర్వ చిన్నవీరేష్(30) గతేడాది డిసెంబర్ 2న కర్ణాటకలోని రాయచూర్ జిల్లా జిలంగేరికి కూలి పనికెళ్లి మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతుని తండ్రి వెంకటేష్ తన కొడుకు చిన్న వీరేష్ మృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ జనవరి 17న గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్లు, తహసీల్దార్ సలీముద్దీన్, ఎస్‌ఐ మల్లేష్‌ల సమక్షంలో పూడ్చి శవాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం చేసి పంచనామా నిర్వహించారు.

'ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీసులు కొట్టారు'


దెబ్బలను చూపుతున్న బాధితులు

కల్వకుర్తి టౌన్: ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు బాధితులను కొట్టిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం.. కల్వకుర్తి మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన రెండు కుటుంబాల మధ్య సోమవారం సాయంత్రం పందుల విషయంలో గొడవ జరిగింది. గొడవలో ఒక కుటుంబం వారు మరో కుటుంబాన్ని దారుణంగా కొట్టగా, దాడి చేసిన కుటుంబంపై ఫిర్యాదు చేయడానికి మరో కుటుంబం వారు కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దీంతో ఫిర్యాదు చేయడానికి వచ్చిన వెంకటయ్య, నిరంజన్, సత్తయ్యలను పోలీసులు కొట్టడంతో వారి శరీరంపై గాయాలయ్యాయి. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి వస్తే పోలీసులు ఇలా కొట్టడం ఏమిటని బంధువులు, గ్రామస్తులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు రావడంతో విషయం బయటకు వచ్చింది. తమను ఎందుకు కొట్టారని అడిగితే పోలీసులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని బాధితులు విలేకరులతో వాపోయారు. అకారణంగా తమను కొట్టిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెబుతున్న పోలీసులు

పండ్ల చోరీ.. ప్రాణాలు తీసింది

24 గంటల్లో దాడి కేసును ఛేదించిన పేట పోలీసులు

- నిందితుల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ లింగయ్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట: దుకాణంలో పండ్లు చోరీకి పాల్పడుతున్న వ్యక్తిపై దాడి చేయడంతో మృతిచెందిన ఘటన కేసులు పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం డీఎస్పీ లింగయ్య విలేకరులకు వెల్లడించారు. రాజస్తాన్‌కు చెందిన విక్రమ్‌సింగ్, కారు, శివరాజ్ నాలుగేళ్ల క్రితం జీవనోపాధి కోసం మహబూబ్‌నగర్ వచ్చి టైల్స్ పనిచేసుకునేవారు. అయితే ఇటీవల విక్రమ్‌సింగ్, కారు నారాయణపేటలో టైల్స్ పనికోసం వచ్చారు. విక్రమ్‌సింగ్ సోమవారం తెల్లవారుజామున 3.25 గంటల సమయంలో పండ్ల దుకాణం దగ్గర అనుమానుతిడిగా కనిపిండంతో కాపు కాసిన మాదం బాలరాజు, చింత గోపి, దాసరి రాజు, గుర్మిట్కల్ నరేష్, ఎండీ రఫీలు కట్టెలతో దాడిచేశారు. దెబ్బలకు తాళలేక విక్రమ్‌సింగ్ స్పృహతప్పి పడిపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీరా 9 గంటల ప్రాంతంలో పండ్ల వ్యాపారి గోపి వచ్చి యువకుడిని ఆటోలో తీసుకెళ్లి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని యువకుడు గాయపడ్డాడని చేర్పించారు. అప్పటికే యువకుడు మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించడంతో ఆ విషయాన్ని మిగతా నలుగురికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి పారిపోవాలనుకున్నారు. అయితే విక్రమ్‌సింగ్ చనిపోయి ప్రభుత్వ ఆస్పత్రిలో డెడ్ బాడీ ఉందంటూ కారు అనే వ్యక్తి శివరాజ్‌కు చెప్పడంతో వెంటనే పేటకు చేరుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దొంగగా అనుమానించి..

బస్టాండ్ పక్కన గోపి అనే వ్యక్తి పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే రాత్రి సమయంలో పండ్లు చోరీకి గురవుతుండటంతో సోమవారం రాత్రి కాపు కాశారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 3.25 గంటల ప్రాంతంలో విక్రమ్‌సింగ్ అనుమానాస్పదంగా తిరగడంతో దాడి చేయగా దెబ్బలకు తాళలేక మృతిచెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం విచారణ చేపట్టి 24 గంటల్లో నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఐదుగురు నిందితులతో మృతుని చంపడానికి ఉపయోగించిన ఐరన్ పైపు, ప్లాస్టిక్ పైపు, కట్టెలు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లో కేసు ఛేదించిన సీఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు రాములు, లింగమూర్తి, ఆంజనేయులును డీఎస్పీ అభినందించారు.

వరకట్న వేధింపు కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష


యోగేష్ గౌతమ్, ఎస్పీ

నారాయణపేట: వరకట్న వేధింపులతో భార్య మృతికి కారణమైన భర్త మహేష్‌కుమార్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వివరాలు.. నారాయణపేట మండలం సింగారం గ్రామానికి చెందిన భవాని(21)కి 2022 మే నెలలో కర్ణాటక రాష్ట్రం యాద్గిరి జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌తో వివాహం చేశారు. పెళ్లైన కొన్ని నెలలు భార్యాభర్తలు బాగానే ఉన్నారు. అనంతరం మహేష్‌కుమార్, అతని తల్లిదండ్రులు నారాయణ, పార్వతమ్మలు అదనపు కోసం వేధింపులకు గురిచేసేవారు. ఈవిషయాన్ని అప్పట్లో ఆమె తన అన్న భరత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సింగారం గ్రామానికి తీసుకొచ్చారు. కాగా పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి మాట్లాడిన వారిలో ఎలాంటి మార్పులేదు. దీంతో భవాని తన అన్న ఇంట్లో అందరూ నిద్రపోయాక మే 5, 2023న చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. భరత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి నారాయణపేట ఎస్‌ఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ సత్యనారాయణ దర్యాప్తు చేసి కోర్టు చార్జిషీట్ ఫైల్ చేశారు. ప్రస్తుత డీఎస్పీ నల్లపు లింగయ్య ఆదేశాల మేరకు, సీఐ శివకుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కోర్టు లైజనింగ్ అధికారి కృష్ణయ్యగౌడ్, కోర్టు డ్యూటీ అధికారులు విజయ్ కుమార్, ఏఎ మీర్జా బేగ్ సాక్షులకు సమాన్లు అందజేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ బాలప్ప వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పీపీని, పోలీసు అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు.